

# ఎంఈవో పాత్ర కీలకం

ఎంఈవో దంపతులను సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, జనవరి 2 : విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఎంఈవోల పాత్ర కీలకమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం బోథ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన కుమ్మరి పోశెట్టి సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఈవో దంపతులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్, బీఆర్‌ఎస్ పట్టణ శాఖాధ్యక్షుడు ప్రశాంత్, డాక్టర్ స్వామి పాల్గొన్నారు.



# బీఆర్‌ఎస్‌లో చేరిక..

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

నార్నూర్, ఫిబ్రవరి 2 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నార్నూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ హైమద్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ ఆదివారం తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి బీఆర్‌ఎస్ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, మాజీ సర్పంచ్‌లు రాథోడ్ విష్ణు, ముక్తారూప్‌దేవ్, పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, నాయకులు అలంఖాన్, సుల్తాన్‌ఖాన్, మూసా పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# నాగోబా భక్తజనం సందోహం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 2 : కేస్లాపూర్ నాగోబాను దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఆదివారం గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆలయంతోపాటు జాతర పరిసరాలు కిక్కిరిశాయి. నాగోబా ఆలయ అభివృద్ధి కోసం మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భక్తులతోపాటు వ్యాపారస్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

**దర్శించుకున్న మాజీ మంత్రి జోగు రామన్న**

మాజీ మంత్రి జోగు రామన్న ఆదివారం నాగోబా ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా తీసిన కొత్త నాగోబా క్యాలెండర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం శాలువాతో రామన్నను సన్మానించి నాగోబా ఫొటోను బహూకరించారు. ఆయన వెంట మెస్రం వంశీయులు దేవ్‌రావ్, సోనేరావ్, కోసేరావ్, నాగోరావ్, మానిక్‌రావ్ ఉన్నారు.



**ఆదిలాబాద్ జిల్లాపై కేంద్రం చిన్నచూపు**

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అవసరమైన వనరులు ఉన్నాయి. సిమెంట్ వినియోగం పెరుగుతుండడంతో డిమాండ్ బాగా ఉంది. వేలాది మందికి ఉపాధి కల్పించే సీసీఐని ప్రారంభించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా ఫలితం లేదు. రైల్వేలైన్, విమానాశ్రయం విషయంలో కేంద్రం స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీతోపాటు నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలున్నా బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం శోచనీయం.

*- నారాయణ, ఆదిలాబాద్*



తాండూర్ : నర్సాపూర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# బడ్జెట్‌పై నిరసనల హోరు

## ఉమ్మడి జిల్లాకు మొండిచేయి చూపడంపై ఆందోళన

- కేంద్ర మంత్రులు హామీలు మరిచారని మండిపాటు
- ఎన్నికల హామీలు ఏమయ్యాయని చర్చ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించకపోవడంతో ఎదురుచూపులే మిగులుతున్నాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని అభివృద్ధి పనుల ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు మరోసారి నిరాశకు గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం, హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు వంటి విషయాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. వీటికి నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉండగా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదకొండేళ్లుగా వీటిని బడ్జెట్‌లో గుర్తించకపోవడం జిల్లావాసులను అసహనానికి గురి చేస్తున్నది. జిల్లాలోని ప్రాజెక్టుల విషయంలో ముందడుగు వేయకపోవడంతో జిల్లా అభివృద్ధిపై బీజేపీకి చిత్తశుద్ధి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రైల్వేలైన్‌కు నిధులు కేటాయిస్తే బాగుండేది..**



జిల్లా ప్రజలు ఎన్నో రోజులుగా ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ కోసం ఎదురు చూస్తున్నారు. రైలుమార్గం ద్వారా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు పోయే అవకాశం ఉంటుంది. వ్యాపారులకు రైలు సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రయాణభారం తగ్గడంతోపాటు సరుకుల రవాణ సులభంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఈ రైలు మార్గం ఏర్పాటు కోసం బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరం. ప్రజల అవసరాలను గుర్తించి రైలుసౌకర్యం కల్పించాలి.

*- గంధ్రత్ సంతోష్, ప్రధాన కార్యదర్శి, చాంబర్ ఆఫ్ కామర్స్, ఆదిలాబాద్*

**ఎన్నికల హామీలు ఏమయ్యాయి?**

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థులు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయనే విమర్శలు వస్తున్నాయి. గతంలో బీజేపీ కేంద్ర మంత్రులు సిమెంటు పరిశ్రమ విషయంలో సానుకూలంగా స్పందించారు. సీసీఐని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వయాన కేంద్ర మంత్రులు ప్రకటించిన సిమెంటు పరిశ్రమకు మోక్షం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అభివృద్ధి పనులు ప్రారంభమైతే జిల్లావాసులకు ప్రయోజనం చేకూరుతుంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. వీటితోపాటు ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం, వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు మెరుగుపడుతాయి.

**వనరులున్నా నిర్లక్ష్యం**




బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను తిరిగి ప్రారంభించడానికి అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయి. సీసీఐలోని 700లకు పైగా ఎకరాల స్థలంలో లైమ్‌స్టోన్‌తోపాటు ఇతర ముడిసరుకు, నీటి సౌకర్యంతోపాటు జాతీయ రహదారి ఉంది. ప్రస్తుతం ఆదిలాబాద్‌కు చెందిన వ్యాపారులు దూరప్రాంతాల నుంచి సిమెంట్‌ను కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. దీంతో వినియోగదారులు ధర ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. సిమెంటు పరిశ్రమ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడనాడి పరిశ్రమ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

*- యానిస్ అక్బానీ, ఆదిలాబాద్*

## కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్

తాండూర్, ఫిబ్రవరి 2 : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక, ఆర్థిక సంస్కరణల కొనసాగింపే ఈ బడ్జెట్ అని సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారామ్ ఆరోపించారు. తాండూరు మండలంలోని నర్సాపూర్‌లో ఆదివారం సీపీఎం, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని విమర్శించారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ సంస్కరణలను చేపట్టక పోవడం వికసిత్ భారత్ బడ్జెట్ కాదు ఇది కార్పొరేట్ సంస్థల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. బడ్జెట్ పునఃపరిశీలించి పెట్రోల్, డీజిల్‌పై పన్నులు రద్దు చేయాలని, అను ఇంధన సంస్థలను ప్రైవేటీకరించవద్దని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ తీసుకొచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర పథకాలకు నిధులు పెంచాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్ లో నిధులు పెంచాలని, విభజన హామీల అమలుకు బడ్జెట్ కేటాయించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం బీహార్‌కు వరాలు తెలంగాణకు మొండి చేయి చూపడం సరికాదన్నారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



● నేడు వసంత పంచమి

బాసర సరస్వతీ ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

# బాసరలో భక్తజనం

- కొనసాగుతున్న వేడుకలు
- సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం



తన కుమారుడికి అక్షర శ్రీకారం చేయిస్తున్న దిల్‌రాజు

బాసర, ఫిబ్రవరి 2 : చదువుల తల్లి సరస్వతీ క్షేత్రంలో శనివారం నుంచి జరుగుతున్న వసంత పంచమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారి పిల్లలకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు. సరస్వతీ అమ్మవారిని సినీ నిర్మాత దిల్‌రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తన కుమారునికి అక్షరాభ్యాస పూజలు జరిపించారు.

**నేడు వసంత పంచమి..**

అమ్మవారి జన్మదినమైన వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం వసంత పంచమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక బృందం తెలిపింది. అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రి పట్టు వస్త్రాలు సమర్పించాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ కారణంగా జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

**భారీ పోలీసు బందోబస్తు**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 2 : భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్, అవినాశ్, రాకేశ్ మీన బాసరలోనే మకాం వేశారని తెలిపారు. బాసరలో అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఏఎస్పీలు, పది మంది సీఐలు, 22 మంది ఎస్సైలు, ముగ్గురు మహిళా ఎస్సైలు, 15 మంది ఏఎస్సైలు, 200 మంది పోలీస్ సిబ్బంది, 50 మంది మహిళా పోలీస్‌లు, 64 మంది హోంగార్డులు, షీ టీంలు, సీసీఎస్ టీంలు విధులు నిర్వహిస్తున్నాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులేవీ?

ఎంపీ, ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలి?

- బీజేపీ నాయకులు ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టారు
- బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తావా?
- మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పెండింగ్ ప్రాజెక్టులను సాధిస్తామని చెప్పిన ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, ఆదిలాబాద్ విమానాశ్రయం, సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణ, గిరిజన యూనివర్శిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతోపాటు ఇతర ప్రాజెక్టుల ప్రస్తావన లేదన్నారు. తమను గెలిపిస్తే కేంద్ర పెద్దలను ఒప్పించి పెండింగ్ ప్రాజెక్టులను సాధిస్తామని ప్రగల్బాలు పలికిన ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ గొప్పగా ఉందని, కేవలం పద్దులు ప్రకటించారని పూర్తిస్థాయి బడ్జెట్ తెలువాల్సి ఉందని అంటున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిధుల కేటాయింపులు లేకపోతే పదవికి రాజీనామా చేస్తాడా ? అని సవాల్ చేశాడు. కేంద్రంలోని అధికార పార్టీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు జిల్లాకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని మండిపడ్డారు.

**ఎయిర్‌పోర్టు ఎన్‌వోసీ విషయం ఏమైంది?**

ఆదిలాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టును మంజూరు చేసిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇవ్వకపోవడంతో పనులు ప్రారంభంకావడం లేదని గతంలో మాట్లాడిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇప్పుడు ఎన్‌వోసీ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డితో లాలూచి పడ్డారని ఆరోపించారు. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్, తాను కేంద్ర మంత్రులను కలిసినా స్పందించలేదన్నారు. బీజేపీ పదకొండేళ్ల పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, పదకొండేళ్ల కిందట దేశం అప్పు రూ.65 లక్షల కోట్లు కాగా, ప్రస్తుతం రూ.181 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని కొల్లగొడుతూ అదానీ, అంబానీ వంటి వ్యాపావేత్తలతో కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, ధమ్మపాల్, ఉగ్గే విఠల్ పాల్గొన్నారు.

**అండర్-19 మహిళా జట్టుకు అభినందనలు**

అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టును అభినందిస్తున్నట్లు మాజీ మంత్రి రామన్న తెలిపారు. ఈ పోటీల్లో తెలుగు అమ్మాయి గొంగడి త్రిష ప్రతిభనుకనపర్చడం సంతోషంగా ఉందన్నారు. మహిళా జట్టు భవిష్యత్తులో మరి న్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.